


ఓటర్లకు ఆ రోజు స్పెషల్ క్యాజువల్ లీవ్

కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్నవారికి పోలింగ్ రోజు అయిన ఈనెల 27న స్పెషల్ క్యాజువల్ లీవును ఎన్నికల సంఘం ప్రకటించిందని కలెక్టర్ అంబేడ్కర్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 27న ఎన్నికలు జరిగే పోలింగ్ కేంద్రాల ఏర్పాట్ల కోసం ముందు రోజు 26న కూడా స్థానిక సెలవుగా ప్రకటించామన్నారు.



గ్రూప్-2 పరీక్ష గది

గ్రూపు-2 మెయిన్స్‌కు సర్వం సిద్ధం

- 12 కేంద్రాల్లో పరీక్షలు
- హాజరుకానున్న 6265 మంది అభ్యర్థులు

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో గ్రూపు-2 మెయిన్స్ పరీక్ష ఆదివారం జరగనుంది. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలోని 12 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. బొండపల్లి, డెంకాడ మండలాలతోపాటు జిల్లా కేంద్రంలో పరీక్షలు జరగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 6365 మంది అభ్యర్థులు రాయనున్నారు. ఉదయం 10 నుంచి 12.30 (పేపర్ 1), మధ్యాహ్నం 3 నుంచి 5.30 (పేపర్ 2)పరీక్ష జరగనున్నది. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి 8.30 నుంచి 9.30 మధ్య హాజరుకావాలి. మరో 15 నిమిషాలు గ్రేస్ పిరియడ్ ఇస్తారు. అలాగే మధ్యాహ్నం పరీక్షకు 2.45కు హాజరు కావాల్సి ఉంది. ఈ సమయం దాటితే పరీక్ష కేంద్రానికి అనుమతించరు. పరీక్షకు హాజరు కానున్న అభ్యర్థులు వారి హాల్ టిక్కెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకువెళ్లాల్సి ఉంది. ప్రతి పరీక్ష కేంద్ర వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. పరీక్ష కేంద్రంలో విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సు సదుపాయం కల్పిస్తున్నారు.

అభ్యర్థుల ఆందోళన

రోస్టర్ పాయింట్లను పక్కాగా అమలు చేసిన తరువాత గ్రూపు -2 మెయిన్ పరీక్ష నిర్వహించాలంటూ అభ్యర్థులు శనివారం కోట వద్ద నిరసన తెలిపారు. నోటిఫికేషన్ ఇవ్వక ముందు రోస్టర్ పాయింట్లు ప్రకటించాల్సి ఉందని, అప్పట్లో వైసీపీ ప్రభుత్వం హడావుడిగా పరీక్ష నిర్వహించిందని, ప్రిలిమినరీ అయ్యాక రోస్టర్ ప్రకటిస్తామని చెప్పారని, నేటికీ రోస్టర్ విధానం ప్రకటించలేదని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారం కోర్టులో ఉంటుండగా కూటమి ప్రభుత్వం మెయిన్స్ నిర్వహించడం సరికాదన్నారు.



కోట వద్ద అభ్యర్థుల ఆందోళన

ఆ విచారణపై అనుమానాలు

కూనేరు పంచాయతీ మిర్తివలస గ్రామానికి చెందిన గర్భిణి పాడి గౌరమ్మ 108లో ప్రసవించిన ఘటనపై విచారణ అనేక మలుపులు తిరుగుతోంది. ఆ సమయంలో వైద్యులు వ్యవహరించిన తీరు చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. ఘటనపై అటు డీసీహెచ్‌ఎస్ ఇటు డీఎంహెచ్‌ఓలు ఇప్పటికీ ఎవరివాదన వారు వినిపిస్తుండడం, భిన్న ప్రకటనలు చేస్తుండడం అందరినీ విస్తుపరుస్తోంది. ఎవరినీ బాధ్యులుగా గుర్తించకపోగా, ఘటనపై నివేదిక విషయంలోనూ సమన్వయం లేకపోవడం వంటి అంశాలు అనుమానాస్పదంగా ఉన్నాయన్న అభిప్రాయం వినిపిస్తోంది.



108లో ప్రసవించిన గర్భిణి గౌరమ్మ (ఫైల్)

- స్థానిక అధికారికే బాధ్యతలు
- గర్భిణి ఘటన దర్యాప్తులో అనేక సందేహాలు
- బాధ్యులను గుర్తించారా? వెనకేసుకొస్తున్నారా?
- డీసీహెచ్‌ఎస్‌కు అందిన నివేదిక
- ఏరియా ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యమేమీ లేదని తేల్చేసిన వైనం
- పక్షం రోజులు దాటినా డీఎంహెచ్‌వోకు చేరని రిపోర్టు

వైద్యుల నిర్లక్ష్యమేమీ లేదు..

గర్భిణి గౌరమ్మ ఘటనలో నివేదిక అందింది. ఏరియా ఆస్పత్రి అధికారులు, సిబ్బంది తప్పేమీలేదని విచారణలో స్పష్టమైంది. ఆమెకు తొలి కాన్పు సిజేరియన్ అయింది. రెండో కాన్పు సమయంలో ఆమెకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆ పరిస్థితుల్లో రిస్కు తీసుకుంటే తల్లీబిడ్డ ప్రాణాలకు ముప్పు అని ఘోషాకు రిఫర్ చేశారు తప్ప తప్పించుకునే ఉద్దేశంతో కాదు. జీజీహెచ్, ఘోషా మాదిరిగా ఏరియా ఆస్పత్రిలో గైనకాలజిస్టులు 24/7 అందుబాటులో ఉండరు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. అందువల్ల దీనిపై విచారణ ముగిసినట్టే. విచారణ జరపాలని, నివేదిక వద్దని డీఎంహెచ్ఓ రాతపూర్వకంగా ఇచ్చారు.

-రాజ్యలక్ష్మి, డీసీహెచ్‌ఎస్



నివేదిక రావాల్సి ఉంది..



గర్భిణి ఘటనపై నివేదిక అందాల్సి ఉంది. గజపతినగరం ఏరియా ఆస్పత్రి డీసీహెచ్‌ఎస్ పరిధిలోకి వస్తుంది. అందువల్ల ముందురోజు నేను వెళ్లి వచ్చాక డీసీహెచ్‌ఎస్ కూడా వెళ్లి పరిశీలించారు. విచారణ నివేదిక డీసీహెచ్‌ఎస్ ద్వారా త్వరలోనే నా వద్దకు వస్తుందని భావిస్తున్నా, సమగ్రంగా పరిశీలించాల్సి ఉంది. ఆ తర్వాతే ఏమైనా చెప్పగలను.

-జీవనరాణి, డీఎంహెచ్‌వో

మెంటాడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి)

కూనేరు పంచాయతీ మిర్తివలస గ్రామానికి చెందిన నిండుచూలాలుగా ఉన్న గౌరమ్మ తీవ్ర ప్రసవ వేదనతో ఈనెల 4న సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో గజపతినగరం ఏరియా ఆస్పత్రికి వెళ్లింది. అక్కడున్న సిబ్బంది కనీసం తనిఖీ కూడా చేయకుండా గౌరమ్మను అట్నుంచి అటే ఘోషాసుపత్రికి రిఫర్ చేశారు. ఆపై 108 వాహనంలో విజయనగరం శివారుకు చేరుకునేసరికి పురిటినొప్పులు తీవ్రమవడంతో అప్రమత్తమైన 108 సిబ్బంది చొరవతో ఆమె ఆ వాహనంలోనే మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ ఘటన జిల్లాలో చర్చనీయాంశమైంది. ప్రభుత్వ ఆస్పత్రులు ఇన్ని ఉన్నా దయనీయ స్థితిలో 108లో ప్రసవించడం ఏమిటి? గర్భిణి పరిస్థితి విషమించి **(మిగతా 8వ పేజీలో..)**

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ఠ బందోబస్తు

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల శాసనమండలి ఎన్నికలకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్పీ వకుల్‌జిందాల్ చెప్పారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా చూస్తామన్నారు. నగరంలోని ప్రభుత్వ సంగీత కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగు కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. గదులను పరిశీలించి సీసీ కెమెరాలు, లైట్లు సక్రమంగా పనిచేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట సీఐలు శ్రీనివాస్, లీలారావు, సూరినాయుడు, ఎస్ఐలు రామగణేష్, రవితో పాటు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై ఆరా తీస్తున్న ఎస్పీ

రైతుల సమక్షంలోనే రీసర్వే: జేసీ

భోగాపురం, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): రైతుల సమక్షంలోనే రీసర్వే నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ సర్వే సిబ్బందికి సూచించారు. రీసర్వేలో పైలెట్ ప్రాజెక్టుకు ఎంపిక చేసిన భోగాపురం మండలం రావాడ గ్రామంలో నిర్వహిస్తున్న ప్రక్రియను ఆయన శనివారం పరిశీలించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ భూములకు సంబంధించిన రైతుల సమక్షంలోనే సర్వే నిర్వహించాలన్నారు. రైతులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించా లని చెప్పారు. మ్యాప్ ఆధారంగా సర్వేతీరును పరిశీలించారు. సర్వే ఏవిధంగా చేస్తున్నారు? ఎంత వరకు చేశారు? అనే వివరాలను సర్వే సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సురేష్, డిఐఓఎస్ భగవాన్, సర్వే డీటీ రవి, రైతులు ఉన్నారు.



సర్వే మ్యాప్‌ను పరిశీలిస్తున్న జేసీ

గంజాయి కేసుల్లో దర్యాప్తు వేగవంతం 6లో

- డీఐజీ గోపీనాథ్ జెట్టి



సందేశాత్మకంగా నాటికలు 6లో

- విశేషంగా హాజరవుతున్న ప్రజలు
- బాలలు, యువకుల్లోనూ ఆసక్తి



అంగన్వాడీలకు గ్రాట్యుటీ 6లో

- జిల్లాలో 2400 మంది అంగన్వాడీ సిబ్బందికి ప్రయోజనం

టమాట కిలో రూ.8

- రైతుకు మద్దతుగా మార్కెటింగ్ శాఖ చర్యలు
- రైతుబజార్లకు పంట తరలింపు

శృంగవరపుకోట/విజయనగరం రూరల్, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం టమాటా రైతులకు అండగా నిలుస్తోంది. వారికి మద్దతు ధర చెల్లించేందుకు రైతు బజార్ల ద్వారా పంట కొనుగోలు చేస్తోంది. జిల్లాలో టమాట పంట విరివిగా దిగుబడి వచ్చింది. దీంతో ధర అమాంతం పడిపోయింది. మార్కెట్‌లో కిలో రూ.4కు కూడా అడగడం లేదు. ఈ పరిస్థితిలో మార్కెటింగ్ శాఖ రైతుల నుంచి నుంచి కిలో రూ.8 చొప్పున కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చింది. మార్కెటింగ్‌శాఖ ఏడీ బి.రవికిరణ్ ఆదేశాల మేరకు రెండు రోజులుగా రైతుబజార్లకు టమాటా తరలుతోంది. కిలో వద్ద రూ.2 రవాణా ఖర్చులను కలుపుకొని రైతు బజార్లలో అదనంగా మరో రూ.2 లాభం కలిపి రూ.12కు విక్రయిస్తున్నారు. ఇలా శనివారం గంట్యాడ మండలం తాటిపూడికి చెందిన రైతు ప్రసాద్ నుంచి 40 క్రాట్లు, గజపతినగరం మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన రైతు శ్రీనివాస్ నుంచి 85 క్రాట్స్ కలిపి 125 క్రాట్స్ (31.25 క్వింటాలు) టమాటాను ఎస్.కోట రైతుబజారుల్లో విక్రయించేందుకు కొనుగోలు చేసినట్లు ఎస్టేట్ అధికారి సురేష్ తెలిపారు. కాగా ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల స్థాయిలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. మండల ఉద్యానశాఖాధికారి ఆధ్వర్యంలో కమిటీ పనిచేస్తుంది.

- జిల్లాలో ఏడు రైతు బజార్ల ద్వారా టమోటాను కిలో రూ.12 విక్రయించాలని నిర్ణయించారు. ఈ నెల 20న రైతు బజార్లలో కిలో టమోటా రూ.9 ఉండగా, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్న ప్రభుత్వ ఆదేశాలతో అన్ని రైతుబజార్లలో రూ.12కు అమ్మాలని నిర్ణయించారు. టమాట విక్రయాలు పూర్తయిన తరువాత రవాణాఛార్జీలు మినహాయించి మిగతా మొత్తాన్ని రైతులకు అందజేయనున్నారు.



విద్యాశాఖను బొత్స భ్రష్టు పట్టించారు

- నీతి ఆయోగ్ నివేదిక చూస్తే బాధేస్తోంది
- టీడీపీ సీనియర్ నేత అశోక్‌గజపతిరాజు

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో విద్యా వ్యవస్థ సర్వనాశనం అయ్యిందని, విద్యాశాఖను అప్పటి మంత్రి బొత్స భ్రష్టు పట్టించారని టీడీపీ సీనియర్ నేత అశోక్‌గజపతిరాజు తీవ్రంగా విమర్శించారు. విజయనగరంలోని పార్టీ కార్యాలయంలో మంత్రి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో కలిసి ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కరపత్రాలను శనివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం విద్యా వ్యతిరేక విధానాలు అవలంభించిందని, నీతి ఆయోగ్ నివేదిక చూస్తే బాధేస్తోందని అన్నారు. రాష్ట్రంలో ఎంతో మంది విద్యాశాఖను నిర్వహించారని, వారి హయాంలో బలోపేతం కాగా, విజయనగరం జిల్లాకు చెందిన బొత్స సత్యనారాయణ ఆ శాఖ నిర్వహించిన తరువాత విద్యాశాఖ భ్రష్టు పట్టిందన్నారు. అతన్ని ప్రస్తుతం శాసనమండలి ప్రతిపక్ష నేత అనేకన్నా, ఒక బ్రోకర్ అనుంటే సరిపోతుందన్నారు. బొత్స హయాంలో విద్యాశాఖకు ప్రయోజనం జరగకపోగా నష్టమే వాటిల్లిందన్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రఘువర్మ నిజాయితీగల నేత అని, ఈ నేపథ్యంలోనే కూటమి రఘువర్మకు మద్దతు ఇచ్చిందని చెప్పారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, వైసీపీ ఐదేళ్ల పాలనలో విద్యా వ్యవస్థ దిగజారిందని, నీతి ఆయోగ్ లాంటి సంస్థ రాష్ట్రంలో విద్యావ్యవస్థ తిరోగమనాన్ని తన నివేదికలో పొందుపరిచిందన్నారు. వైసీపీ దెబ్బతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరే వారి సంఖ్య క్రమంగా తగ్గిపోయిందన్నారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ రఘువర్మ విజయానికి కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ అంతా కలసికట్టుగా రఘువర్మ విజయానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకురాలు, రాష్ట్ర పర్యాటకశాఖ డైరక్టరు ఇందుకూరి సుబ్బలక్ష్మీ, క్రోతు రాధామణి, బెవర భరత్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ రఘువర్మకు మద్దతుగా కరపత్రం విడుదల చేస్తున్న అశోక్, మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే

ముఖ్యమంత్రిపై బొత్స వ్యాఖ్యలు తగవు

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల్లో దూసుకు వెళ్తున్నదని, దీనిని జీర్ణించుకోలేక ఎమ్మెల్సీ బొత్స అవాకులు, చవాకులు పేలుతున్నారని, అటువంటి వారికి రాజకీయంగా పుట్టగతులుండవని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హితువుపలికారు. టీడీపీ కార్యాలయంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజులతో కలిసి ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. సీనియర్ నాయకుడైన బొత్స లాంటి వ్యక్తి ముఖ్యమంత్రి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. వైసీపీ అధికారంలో వున్న సమయంలో రైతుల నుంచి కొన్న ధాన్యానికి సకాలంలో నగదు చెల్లించలేదని గుర్తుచేశారు. చంద్రబాబు నాయకత్వంలో నూతన ప్రభుత్వం ఏర్పాటైన తరువాత బకాయిలు కూడా చెల్లించామన్నారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కూడా మాట్లాడారు.

అంగన్వాడీలకు గ్రాట్యుటీ



- మాట నిలుపుకున్న సీఎం చంద్రబాబు
- జిల్లాలో 2400 మంది అంగన్వాడీ సిబ్బందికి ప్రయోజనం
- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిశాక జీవో?

మెంటాడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి)

అంగన్వాడీలకు కూటమి ప్రభుత్వం తీపికబురు అందించనుంది. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఏళ్లుగా ఎదురుచూస్తున్న గ్రాట్యుటీ అమలుకు ఆమోదం తెలిపింది. నెల రోజులుగా దీనిపై కసరత్తు చేస్తూ ఇటీవల ఈ నిర్ణయం తీసుకుంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిశాక జీవో ఇవ్వనుంది.

గత ఐదేళ్లూ అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం గ్రాట్యుటీ అమలును కేంద్రంపై నెట్టివేస్తూ కాలాన్ని గడిపేసింది. అంగన్‌వాడీలు 50 రోజులపాటు రోడెక్కి ధర్నాలు చేసినా పట్టించుకోలేదు. కూటమి అధికారంలోకి వచ్చాక గ్రాట్యుటీని అమలు చేస్తామని అంగన్వాడీల ఆందోళన సమయంలో ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. అంతేకాకుండా కూటమి మేనిఫెస్టోలో కూడా ఒకటిగా చేర్చారు. ఇచ్చిన మాటను నిలుపుకుంటూ అధికారంలోకి వచ్చిన 8 నెలల్లోనే కూటమి ప్రభుత్వం దీనికి ఆమోదం తెలిపింది. గ్రాట్యుటీపై కేంద్రానికి లేఖ రాస్తూనే సొంతంగా అమలుకు మొగ్గుచూపింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత అధికారికంగా జీవో ఇవ్వనుంది. గ్రాట్యుటీ అమలు నిర్ణయంతో రాష్ట్రంలో లక్ష మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు ప్రయోజనం కలగనుంది. జిల్లాలో సుమారు 2400 మందికి మేలు జరుగనుంది.



ఏడాదికి రూ.20 కోట్లు అదనపు భారం..

రాష్ట్రవ్యాప్తంగా 55,607 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో దాదాపు లక్ష మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు విధులు నిర్వహిస్తున్నారు. విజయనగరం జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు 2,185, వర్కర్లు 289 మంది ఉన్నారు. ప్రస్తుతం పదవీ విరమణ సమయంలో ఏకమొత్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు రూ.లక్ష, ఆయాలకు రూ.40 వేలు ఇస్తున్నారు. ఏటా 600 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, మరో 700 మంది వరకు మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పదవీ విరమణ పొందుతున్నట్టు అధికారిక అంచనా. వీరికి పదవీ విరమణ ప్రయోజనం కింద చెల్లింపులతో ఏటా రూ.8 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు ప్రభుత్వానికి వ్యయమవుతున్నట్టు లెక్కతేలింది. గ్రాట్యుటీని అమలు చేస్తే...ఎన్ని సంవత్సరాలు సర్వీసులో ఉంటే అన్ని ఏళ్ల ఏడాదిలో 15 రోజులు వేతనం చొప్పున ఇస్తారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కార్యకర్తలకు రూ.11,500 వేతనం కాగా ఇందులో 15 రోజుల వేతనమంటే రూ.5,750 వస్తుంది. అంగన్‌వాడీ కార్యకర్తగా విధుల్లోకి తీసుకునేందుకు గరిష్ఠ వయసు 35 ఏళ్లు. 62 ఏళ్లు వచ్చే వరకు ఆమె విధుల్లో ఉండి పదవీ విరమణ చేస్తే 27 ఏళ్లు సర్వీసులో ఉన్నట్టు లెక్క. ఆ ప్రకారం ఆమెకు రూ. 1.55 లక్షలు గ్రాట్యుటీగా వస్తుంది. 25 ఏళ్లకు, 30 ఏళ్లకు అంగన్‌వాడీ కార్యకర్తగా చేరిన వారికి ఇంకా ఎక్కువ గ్రాట్యుటీ అందుతుంది. సర్వీసు ఆధారంగా కొందరికి రూ.2 లక్షల నుంచి రూ.2.20 లక్షల వరకు గ్రాట్యుటీ అందే అవకాశముందని అధికారులు లెక్కగట్టారు. ఆయాలకు నెలకు రూ.7 వేలు కాగా, వారికి సర్వీసుకు అనుగుణంగా గ్రాట్యుటీ అందనుంది. ఏటా జరిగే పదవీ విరమణ అనుగుణంగా వీరికి గ్రాట్యుటీ చెల్లింపులకు రూ.20 కోట్ల ఖర్చు అవుతుందని అంచనా వేశారు.

రెండు రాష్ట్రాలోనే అమలు..

దేశవ్యాప్తంగా గుజరాత్, కర్ణాటక రాష్ట్రాల్లోనే అంగన్‌వాడీల గ్రాట్యుటీ అమలువుతోంది. గుజరాత్ రాష్ట్రానికి సంబంధించిన కేసులో అంగన్‌వాడీలు గ్రాట్యుటీకి అర్హులని సుప్రీంకోర్టు గతంలో తీర్పు ఇచ్చింది. ఆ తర్వాత కర్ణాటక రాష్ట్రం అమల్లోకి తెచ్చింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం దీనికి ఆమోదం తెలిపింది. ఇది అమల్లోకి వచ్చాక మన రాష్ట్రం అంగన్వాడీలకు గ్రాట్యుటీ అమలు చేసే మూడవ రాష్ట్రంగా నిలువనుంది. ఎన్నికల ముందు అంగన్‌వాడీల పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచారు. కాబట్టి 2026 జనవరి వరకు పదవీ విరమణలు ఉండవని అధికారులు గుర్తించారు. ఆ తర్వాత గ్రాట్యుటీ అమల్లోకి వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రావెల్ దందా

- అల్లువాడ, తుంబలిలో ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- రహదారి నిర్మాణానికి తరలిస్తున్న కాంట్రాక్టర్లు



బంజరు మెరకలో యంత్రాలతో గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్న దృశ్యం

జియ్యమ్మవలస, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లువాడ, తుంబలిలో గ్రావెల్ దందా సాగుతోంది. తుంబలి - రావాడ (వయా చింతలపోలమ్మ గుడి) మధ్య ఉన్న సింకి చెరువు దిగువన బంజరు మెరకలో గత నాలుగు రోజులుగా తవ్వకాలు జరుగుతున్నాయి. యంత్రాలతో ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపడుతూ టిప్పర్లలో తరలించుకుపోతున్నారు. సమీపంలోని బీజేపురం పంచాయతీ లోతువానివలస రహదారి నిర్మాణం కోసం ప్రతిరోజూ 30 నుంచి 40 లోడ్లు అక్రమంగా రవాణా చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఒక్కో లోడు విలువ రూ.5వేల వరకు ఉంటుందని, ఇంత జరుగుతున్నా సంబంధిత గ్రామ వీఆర్వో గాని, మండల రెవెన్యూ అధికారులు గాని కనీసం పట్టించుకోకపోవడం లేదని వాపోతున్నారు. కాంట్రాక్టర్ల నుంచి కాసుల కక్కుర్తికి ఆశపడి పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అల్లువాడ, తుంబలి ప్రాంతాల్లో అక్రమంగా చేపడుతున్న గ్రావెల్ తవ్వకాలను సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, మండల కార్యదర్శి కె.సీతారాం శనివారం పరిశీలించారు. కుమ్మరి కులస్థులు కుండలు చేసుకోవడానికి చెరువుల్లో మట్టిని తవ్వితే కేసులు పెట్టే మైనింగ్ అధికారులు, మెయిన్ రోడ్డుకు పక్కనే అక్రమంగా కంకరు తవ్వుకుపోతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. అధికార పార్టీ నేతలకు భయపడి అటువైపు చూడడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని, లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

చర్యలు తీసుకుంటాం..



అల్లువాడ, తుంబలిలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్న విషయం నా దృష్టికి వచ్చింది. దీనిపై సంబంధిత వీఆర్వోకు పిలిపించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆదేశించాం. తరువాత నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

-రెడ్డి ఫకీరు, ఇన్‌చార్జి తహసీల్దార్, జియ్యమ్మవలస



పారమ్మ కొండ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి సంధ్యారాణి

పారమ్మ కొండ జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు

- మంత్రి సంధ్యారాణి

పాచిపెంట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి సందర్భంగా ఈనెల 26న మండలంలోని చెరుకుపల్లి సమీపంలో గల పారమ్మకొండ వద్ద నిర్వహించనున్న జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఈ మేరకు పారమ్మ కొండ వద్ద చేపడుతున్న ఏర్పాట్లను ఆమె శనివారం పరిశీలించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోలీసు, రెవెన్యూ, ఆర్టీసీ అధికారులకు సూచనలు ఇచ్చామని చెప్పారు. భక్తులు పారమ్మ కొండ దగ్గర వరకూ వాహనాలతో చేరుకునేలా అధికారులతో చర్చించామన్నారు. జాతరకు 25 ఆర్టీసీ బస్సులు వేశామని తెలిపారు. మెట్లు మార్గం ఇరువైపులా చిన్న చిన్న తుప్పలను తొలగింపజేశామన్నారు. మార్గమధ్యంలో తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే క్యూలైన్లు ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ పరిశీలనలో నిమ్మాది శెట్టి, మంచాల పారమ్మ ఉన్నారు.

గిరిజనులకే చైర్మన్ పదవి..

గత ఐదేళ్లుగా పారమ్మ కొండ కమిటీ చైర్మన్ పదవి ఖాళీగా ఉందని, ఈసారి గిరిజనులకే కమిటీ చైర్మన్ పదవిని కట్టబెడతామని మంత్రి సంధ్యారాణి స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున చైర్మన్‌ని ఎన్నుకోలేదని చెప్పారు.

సందేశాత్మకంగా నాటికలు

- విశేషంగా హాజరవుతున్న ప్రజలు
- బాలలు, యువకుల్లోనూ ఆసక్తి



చీకటి పువ్వు నాటికలో ఓ సన్నివేశం



నిశ్శబ్దమా నీ ఖరీదెంత? నాటికలో ఓ సన్నివేశం

నెల్లిమర్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జరజాపుపేటలో మూడు రోజులుగా జరుగుతున్న నాటిక పోటీల్లో మూడో రోజు శనివారం ప్రదర్శించిన నాటికలు అందరినీ ఆలోచింపజేశాయి. ఆద్యంతం రసవత్తరంగా సాగాయి. నాటికల్లో కళాకారులు హృద్యంగా నటించి ప్రశంసలు అందుకున్నారు. తొలి నాటిక చీకటి పువ్వును కరీంనగర్ కు చెందిన చైతన్య కళాభారతి కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారు. ఈ నాటికను పీఎస్ నారాయణ రచించగా, పరమాత్మని శివరాం నాటకీకరణ చేశారు. రమేష్ మంచాల దర్శకత్వం వహించారు. "పరిస్థితులకు ఏ మనిషీ అతీతం కాదు. అవసరం కోసమో... అవకాశం లేకో చాలా మంది జీవితంలో తప్పులు చేస్తుంటారు. అయితే ఆ వ్యక్తి పశ్చాత్తాపం పడిన తర్వాత క్షమించి దగ్గరకు తీసుకోవాలనేది" ఈ నాటిక ఇతివృత్తం. ప్రాణం పోయిన తర్వాత బాధపడేకంటే ప్రాణంతో ఉన్నప్పుడే సహకారం అందించాలని రచయిత సందేశం ఇచ్చారు. క్షమించడంలోనే నిజమైన ప్రేమ ఉందని ఈ నాటిక తెలియజెప్పింది.

రెండో నాటికనిశ్శబ్దమా నీ ఖరీదెంత? నాటికను సౌజన్య కళా స్రవంతి (ఉత్తరాంధ్ర) విజయనగరం కళాకారులు ప్రదర్శించారు. ఈ నాటికలో భర్త ఇష్టంలేని భార్య వేరొకరితో వివాహేతర సంబంధం ఏర్పరుచుకుంటుంది. తిరిగి భర్త మీద తప్పుడు కేసులు బనాయించి ఇబ్బందులు పెడుతుంది. ఈ క్రమంలో కుమార్తెను ఇవ్వాలని భర్త అడిగినా ఇవ్వకపోగా ప్రియుడితో కలిసి ఆ చిన్నారిని అంతమొందిస్తుంది. అత్యధిక హత్యలు వివాహేతర సంబంధాల వల్లే జరుగుతున్నాయని.. చాటిన ఈ నాటిక అందరినీ ఆలోచింపజేసింది.

క్షయ వ్యాధిపై కేంద్ర బృందం ఆరా

వేపాడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జాకేరు గ్రామాన్ని జాతీయ క్షయ వ్యాధి నిర్మూలనా అధికార బృందం శనివారం సందర్శించింది. క్షయ వ్యాధిపై బృంద సభ్యులు స్థానికులకు అవగాహన కల్పించారు. జాతీయ క్షయ నిర్మూలన 100 రోజుల కార్యక్రమంలో భాగంగా నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ డిప్యూటీ కార్యదర్శి (న్యూఢిల్లీ)డాక్టర్ ఆషామా భట్నాగర్, స్టేట్ జాయింట్ డైరెక్టర్ టి.రమేష్, డాక్టర్ నిహాసాటియా, విజయనగరం డీఎల్ ఏటీవో డాక్టర్ కె.రాణి, డాక్టర్ ప్రియాంక తదితరులు ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. గ్రామంలోని ఐదుగురుకి ఫుడ్ బాస్కెట్లను అందజేశారు. నీలకంఠరాజపురం శివారు భర్తవానిపాలెం గ్రామంలో ఎక్సరే పాయింట్‌ను పరిశీలించారు. బాధితుడు ఆన్‌లైన్‌లో ఐడీ కార్డును ఎలా తీసుకోవాలో తెలియజేశారు. అనంతరం వేపాడ వెల్నెస్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బుద్ద చిన్నమ్మలు, అప్పలనాయుడు, ఎంపీడీఓ సూర్యనారాయణ, వైద్యాధికారి ధరణి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న జాతీయ బృందం సభ్యులు



భామినిలో కురుస్తున్న వర్షం

కురిసింది వాన

భామిని, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వేసవి సమీపిస్తున్న తరుణంలో జిల్లా అంతటా రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతూ ఉంటే భామిని మండలంలో మాత్రం వర్షాలు కురుస్తుండడం విశేషం. శుక్రవారం ఓ మోస్తరు వర్షం కురవగా, శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. మండలంలోని బత్తిలి నుంచి భామిని వరకు వర్షం కురిసింది. ఈ వర్షం వరి, మొక్కజొన్న, జీడిమామిడి, నువ్వుల పంటకు అనుకూలంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.



మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి

గంజాయి కేసుల్లో దర్యాప్తు వేగవంతం

- డీఐజీ గోపీనాథ్ జెట్టి

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా, ఇతర మాదకద్రవ్యాల కేసుల్లో నేరస్థులకు శిక్ష పడేలా దర్యాప్తు మరింత వేగవంతం చేయాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి ఆదేశించారు. శనివారం ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల పోలీసు అధికారులతో వర్క్‌షాపు నిర్వహించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నియంత్రణ, కేసుల దర్యాప్తులో నిబంధనలు, నియమాలు, నైపుణ్యంపై చర్చించారు. డీఐజీ మాట్లాడుతూ.. 'రాష్ట్ర ప్రభుత్వం గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రధాన అంశంగా తీసుకుంది. గంజాయి రవాణా, వ్యాపారుల మూలాలను తెలుసుకుని, కేసుల నమోదు, దర్యాప్తు విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలి. రేంజ్ పరిధిలోని ఐదు జిల్లాల్లో ఇప్పటివరకు ఎస్ఐ నుంచి ఏఎస్పీ స్థాయి వరకు 320 మంది పోలీసు అధికారులకు చట్టాలపై అవగాహన కల్పించాం. శిక్షలు పడినప్పుడే గంజాయి అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టగలం. గంజాయి కేసుల్లో దర్యాప్తునకు నైపుణ్యమే కీలకమ'ని తెలిపారు. కస్టమ్స్, ఎక్సైజ్, సర్వీస్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ అధికారి ఎ.రంగధామ్ మాదక ద్రవ్యాల నియంత్రణకు సంబంధించి చట్టపరమైన అంశాలు, దర్యాప్తు ప్రక్రియలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ గంజాయి వంటి మాదకద్రవ్యాల కేసులో చట్ట ప్రకారం నియమ, నిబంధనలు పాటిస్తూ దర్యాప్తు పూర్తిచేయాలన్నారు. కేసుల దర్యాప్తులో న్యాయ సలహాదారులను, నిపుణుల సూచనలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, ఏఎస్పీలు కేవీ రమణ, అంకిత సురాన, డీఎస్పీలు వీవీ అప్పారావు, ఎం.శ్రీనివాసరావు, ప్రసాదరావు, ఎం.రాంబాబు పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్‌లోకి టీటీడీ సేవలు



- త్వరలో అందుబాటులోకి తేనున్న ప్రభుత్వం
- రైల్వే, ఆర్టీసీ బస్సు టికెట్లు సైతం పరిశీలన

రాజాం రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి)

టీటీడీ సేవలను కూడా వాట్సాప్ గవర్నెన్స్‌లోకి తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే దీని ద్వారా 161 సేవలు అందిస్తోంది. రాబోయే రోజుల్లో తిరుమల తిరుపతి దేవస్థానం సేవలను కూడా వాట్సాప్ ద్వారా సామాన్యుడికి అందించాలని నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ప్రభుత్వాధికారులతో పాటు టీటీడీ పాలకమండలి, అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలుమార్లు సమీక్ష జరిపారు. త్వరలోనే వెంకటేశ్వరుడి దర్శనం, గదుల కేటాయింపు, అర్జిత సేవలు, కళ్యాణం టికెట్లు ఇతరత్రా సేవలన్నీ వాట్సాప్ ద్వారా బుక్ చేసుకునే సౌకర్యం కలగనుంది.

కేంద్ర ప్రభుత్వ సహకారంతో..

వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా రైలు టికెట్లు అందించేందుకు సైతం కూటమి ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ఇందుకోసం కేంద్ర రైల్వే మంత్రిత్వశాఖ అధికారులతో త్వరలో సమావేశం కానున్నట్లు ముఖ్యమంత్రి ఇప్పటికే ప్రకటించారు. అలాగే సినిమా టికెట్లు, ఆర్టీసీ బస్సుల టికెట్లు పొందడంతో పాటు ఆర్టీసీ జీపీఎస్ ట్రాకింగ్‌ను సైతం వాట్సాప్‌లో చూసుకునే సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం సన్నద్ధం అవుతోంది. ఇదిలా ఉంటే.. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా అందుబాటులో ఉన్న అన్ని సేవలను పొందేందుకు టెక్స్ట్ చేయలేని వారికోసం వాయిస్ సర్వీస్ సైతం పొందుపరిచే అవకాశాలను ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు.

తగ్గనున్న ఆర్థిక భారం..

వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరసేవలు అందుబాటులోకి వస్తే వీటిని వినియోగించుకునే ప్రతిఒక్కరూ ఆర్థికంగా లాభపడడమే కాకుండా విలువైన సమయాన్ని ఆదా చేసుకునే అవకాశం ఉంది. టీటీడీ సేవల కోసం గతంలో జిల్లా కేంద్రంలోని తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన కళ్యాణ మండపం ప్రత్యేక కౌంటర్‌పై ఉమ్మడి జిల్లా ప్రజలు ఆధారపడేవారు. ఆతర్వాత నెట్ సెంటర్లపై ఆధారపడి టీటీడీ సేవలు, గదుల కోసం వందల్లో ఖర్చు చేసే పరిస్థితి ఎదురయ్యేది. రైల్వే రిజర్వేషన్లదీ అదే పరిస్థితి. నలుగురు సభ్యులు తిరుమల వెళ్లాలంటే తక్కువలో తక్కువగా రూ.1000-1500 ఖర్చు చేయాల్సి వచ్చేది. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా టీటీడీ, రైల్వే సేవలు అందుబాటులోకి వస్తే సమయం ఆదా కావడంతో పాటు సర్వీస్ ఛార్జీలమోత కూడా తప్పుతుంది.

న్యూస్ బాక్స్

ఆత్మహత్యాయత్నంపై విచారణ: కలెక్టర్

నెల్లిమర్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గుషిని పంచాయితీ చనమల్లుపేట గ్రామానికి చెందిన చనమల్లు అబద్ధం అనే రైతు మ్యుటేషన్ కోసం రెవెన్యూ అధికారులు లంచం డిమాండ్ చేస్తున్నారని శుక్రవారం నెల్లిమర్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ సంఘటనపై 'భూమి ఆన్‌లైన్‌కు లంచం అడిగారని...' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో శనివారం వార్త ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ సంఘటనపై కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందించి విచారణకు ఆదేశించారు. దీనిపై నివేదిక అందించాలని విజయనగరం ఆర్డీఓ దాట్ల కీర్తిని ఆదేశించారు. నివేదిక అందిన తర్వాత చర్యలు తీసుకుంటామని ఒక ప్రకటనలో తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

మెరకముడిదాం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గర్భాం ఏపీ ఆదర్శ పాఠశాలలో రానున్న విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డీవీఎస్ అరుణ తెలిపారు. మార్చి 31 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఏప్రిల్ 20న పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించి... 27న మెరిట్ జాబితా అందుబాటులో ఉంచుతామని తెలిపారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

గరివిడి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కొండపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీల శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది. గరివిడి ఎంఈవోలు ఎం.రామారావు, పి.అప్పన్న తదితర రిసోర్సు పర్సన్లు శిక్షణ ఇచ్చారు.

నేడు సమావేశం

రాజాం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాజాం రచయితల వేదిక 121వ సమావేశం ఆదివారం సానిక విద్యానికేతన్ పాఠశాలలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్టు నిర్వాహకుడు గార రంగనాథం ఒక ప్రకటనలో తెలిపారు. కవులు. రచయితలు. సాహిత్యాభిమానులు హాజరు కావాలని కోరారు.

ఆర్థిక సాయం

వేపాడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): లాంగ్‌జంప్‌లో రాణిస్తున్న క్రీడాకారిణి గమ్మెల లక్ష్మికి వేపాడకు చెందిన గోల్డెన్ హార్ట్ ట్రస్టు సభ్యులు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. కొండగంగుబూడి గ్రామానికి చెందిన నిరుపేద గిరిజన యువతి లక్ష్మి డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోంది. లాంగ్ జంప్‌లో జాతీయ స్థాయిలో ప్రతిభ చూపుతోంది. ఆర్థిక స్థోమత లేకపోవడంతో సంస్థ సభ్యులు ఆమెకు శనివారం సాయం అందించారు.

సభ్యత్వ కార్డులు పంపిణీ

లక్కవరపుకోట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ కార్యకర్తలందరికీ సభ్యత్వ కార్డులను మండల పార్టీ అధ్యక్షుడు చొక్కాకుల మల్లునాయుడు శనివారం అందజేశారు. మండలం మొత్తం మీద సుమారు పది వేల మంది తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. గ్రామాల వారీగా కార్డులను మండల పార్టీ కార్యాలయంలో అందజేశారు. వీరందరికి రూ.5లక్షల ప్రమాద బీమా వర్తించనున్నట్టు మల్లునాయుడు తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం

రాజాం రూరల్/రాజాం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి దోహద పడతాయని వెయిట్ లిఫ్టర్ చైత్రకుమారి స్పష్టం చేశారు. శనివారం నిర్వహించిన క్రీడోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. విద్యార్థులు ఉపాధి అవకాశాలు పొందడానికి క్రీడలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జీఎంఆర్ఐటీ వ్యాయామోపాధ్యాయులు డా.బిహెచ్.అరుణ్‌కుమార్, ప్రిన్సిపాల్ డా.పురుషోత్తమరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

పరిష్కరించండి

గజపతినగరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పురం అప్పారావు డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల వనరుల కేంద్రంలో ఉద్యోగి సునీతకు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు.

కోళ్ల ఫారం వద్దు

దత్తిరాజేరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సరేయవలస గ్రామానికి సమీపంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న కోళ్లఫారం షెడ్లను నిలుపుదల చేయాలని కోరుతూ స్థానికులు శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే ఇక్కడ ఉన్న కోళ్లఫారాల షెడ్ల వల్ల దోమలు, ఈగలు, దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. తమకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సాలాపు గౌరునాయుడు, సాలాపు లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర టీడీపీకి కంచుకోట


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు తదితరులు

గుర్ల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి ఉత్తరాంధ్ర ప్రాంతం కంచుకోటగా పేరు పొందిందని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. శనివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వైఎస్ఆర్ కాంగ్రెస్‌కు చెందిన రెండు గ్రామాల సర్పంచ్‌లు, కార్యకర్తలు కలిసి తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. వారిని పార్టీ కండువాలు వేసి ఎమ్మెల్యే సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఎస్ఎస్ఆర్.పేట సర్పంచ్ వసంత వీరమ్మతో పాటు కార్యకర్తలు వైసీపీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరారు. రాగోలు సర్పంచ్ చందక బంగారునాయుడుతోపాటు పార్టీ కార్యకర్తలు సుమారు 200 మంది టీడీపీలో చేరారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యువనేత రామ్‌మల్లిక్ నాయుడు, రాష్ట్ర బీసీసెల్ కార్యదర్శి సన్యాసి నాయుడు, నాయకులు కిరణ్‌కుమార్, పార్టీ అధ్యక్షులు సీహెచ్ మహేశ్వరరావు, రాము నాయుడు, సూర్యనారాయణ, అప్పల నాయుడు, లక్ష్మణరావు, కృష్ణ, శ్రీనివాసరావు, వివిధ గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే కళావెంకటరావుకు బాధితులు వినతిపత్రం అందజేశారు. శనివారం మండల కార్యాలయంలో అగ్రిగోల్డ్ మండల స్థాయి అధ్యక్షుడు వల్లూరి చిన్నమనాయుడు తదితరులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యను దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహం: ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలిత కుమారి

కొత్తవలస, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించి.. జిల్లా, రాష్ట్రం తరపున పోటీలకు పంపించవలసిన ఆవశ్యకత ఉందని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. కంటకాపల్లిలోని శారదా కర్మాగార యాజమాన్యం సౌజన్యంతో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న లలితకుమారి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలోని ప్రతిభ గల క్రీడాకారులకు తోడ్పాటు అందించాలన్నారు. విజేతగా నిలిచిన శృంగవరపుకోట నియోజకవర్గ టీముకు రూ.1.25లక్షలు, రెండో స్థానంలో నిలిచిన పార్వతీపురం జట్టుకు రూ. 60 వేలు, తృతీయ, చతుర్థ స్థానాలు సాధించిన కురుపాం, విజయనగరం జట్లకు రూ.30 వేలు, రూ.25 వేల వంతున నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సూరిబాబు, కార్యదర్శి కేవీఏఎన్ రాజు, జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు కె.కృష్ణంరాజు, శారదా కర్మాగార ప్రతినిధులు సనత్ కుమార్ దాస్, ప్రభాత్ మోహన్, కె.విజయ్ భాస్కర్, సంతోష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.కోటితో జిల్లా కేంద్ర ఆసుపత్రికి పరికరాలు


ఎంవోయూ కుదుర్చుకుంటున్న కలెక్టర్

విజయనగరం కలెక్టరేట్ ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి సుమారు రూ.కోటితో అధునిక పరికరాలు అందించేందుకు కొవ్వాడ ఎన్‌పీసీఐఎల్ (నేషనల్ న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఇండియా లిమిడెట్) ముందుకు వచ్చింది. ఈ మేరకు కలెక్టర్ అంబేడ్కర్‌తో ఆ సంస్థ ప్రతినిధులు శనివారం ఎంవోయూ కుదుర్చుకున్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ఈ నిధులతో ఆపరేషన్ థియేటర్, న్యూరాలజీ, యురాలజీ తదితర విభాగాలకు వివిధ రకాల పరికరాలు సమకూరుస్తారు. ఈ కార్యక్రమంలో సీపీఓ బాలాజీ, డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి, ఎన్‌పీసీఐఎల్ అసోసియేట్ డైరెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరీక్షలపై మరింత శ్రద్ధ: డీఎంహెచ్‌వో


రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో ఆరోగ్య పరీక్షలు పటిష్ఠంగా నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జీవనరాణి అన్నారు. మలిచర్ల గ్రామంలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా వైద్య పరీక్షలు చేయాలన్నారు. గ్రామ స్థాయిలో ఎల్‌సీడీసీ సర్వే, ఎన్‌సీడీసీడీ సర్వే, వంద రోజుల టీబీ కార్యక్రమం తీరుపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయిలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు మరింత కష్టించి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ చంద్రశేఖరరాజు, రాకోడు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్లు శ్రావణి, అఖిల, సీహెచ్ఓ మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షల్లో అలసత్వానికి తావివ్వొద్దు: ఆర్జేడీ

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పదో తరగతి పరీక్షల ను ఎటువంటి అలసత్వానికి తావు లేకుండా నిర్వహించాలని రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి.విజయభాస్కర్ అన్నారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈవో మాణిక్యం, డిప్యూటీ డీఈవో వెంకటరమణ, ప్రభుత్వ పరీక్షలు అసిస్టెంట్ కమిషనర్ టి.సన్యాసిరాజు తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జునుడి సేవలో అదనపు న్యాయాధికారి

మెంటాడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): భ్రమరాంబికా సహిత మల్లికార్జునస్వామి దేవాలయాన్ని విజయనగరం జిల్లా అదనపు న్యాయాధికారులు విజయకల్యాణి, కనకలక్ష్మి శనివారం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ చాపాన జోగినాయుడు, అర్చకులు దుడ్డి శ్రీనివాసులు పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికారు.

సంయమనం అవసరం

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా పోలీసులు సంయమనం పాటించాలని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. ఏఆర్ పోలీసులు నిర్వహించాల్సిన విధులు, వినియోగించాల్సిన ఆయుధాలపై 14 రోజుల పాటు పునశ్చరణ తరగతులను పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు గోపాలనాయుడు, రమేష్‌కుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టోల్‌గేట్‌లో ఇరుక్కున్న భారీ వాహనం

డెంకాడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నాతవలస టోల్ గేట్‌ను దాటలేక ఓ భారీ ట్యాంకర్ శుక్రవారం రాత్రి ఇరుక్కుపోయింది. కాకినాడ పోర్టు నుంచి ఒడిశాకు వెళ్తున్న వాహనం టోల్‌గేట్ వద్ద చిక్కుకుంది. దీంతో టోల్‌గేట్ పక్కన ఉన్న రహదారి నుంచి లారీని తరలించేందుకు ప్రయత్నించారు. బారికేడ్లు అడ్డు తగలడంతో వాహనం నిలిచిపోయింది. సిబ్బంది కష్టపడి దానిని పంపించారు.

ఉత్సాహంగా వీడ్కోలు వేడుకలు

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ధర్మవరం ప్రభుత్వ జూనియర్ మహిళా కళాశాలలో శనివారం ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. సీనియర్ విద్యార్థులు పరీక్షలు చక్కగా రాసి..ఉన్నత స్థాయికి ఎదగాలని జూనియర్లు ఆకాంక్షించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

రక్తదాన శిబిరం

రేగిడి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రేగిడి హైస్కూల్‌లో శనివారం పాఠశాల జూనియర్ రెడ్‌క్రాస్ విభాగం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు మొత్తం 40మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రవిశంకర్‌బాబు, హెచ్ఎం లక్ష్మణరావు, రెడ్‌క్రాస్ నోడల్ అధికారి, సైన్స్ టీచర్ బి.ఉమామహేశ్వరి, రాజాం రెడ్‌క్రాస్ ప్రతినిధి చైతన్యకుమార్, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

పెట్రోల్ బంకుల్లో విస్తృత తనిఖీలు


తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ ఎస్పీ ప్రసాదరావు

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంకుల్లో విజిలెన్స్ అధికారులు శనివారం విస్తృత స్థాయి తనిఖీలు చేపట్టారు. శ్రీకాకుళం జిల్లాలోని అరిణాం అక్కివలస, అల్లినగరం, కుశాలపురం, విజయనగరం జిల్లాలో డెంకాడ, జొన్నాడ, విజయనగరంలో పెట్రోల్ బంకుల్లో నిల్వలు నాణ్యత ప్రమాణాలు, రీడింగ్ తదితర వాటిపై విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాదరావు ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. బంకుల్లో జరిగే అక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులతో పాటు సివిల్ సప్లై లీగల్ మెట్రాలజీ అధికారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

లక్కవరపుకోట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఎల్‌కోట బీసీ కానీకి చెందిన పి.ఈశ్వరరావు (47) చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు శృంగవరపుకోట ఎస్ఐ గంగరాజు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఈశ్వరరావు గురువారం రాత్రి ఎల్.కోట జంక్షన్ దగ్గరలో గల ఓ హోటల్ వద్ద ఫోను మాట్లాడుతున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిందని చెప్పారు. గాయపడిన వ్యక్తిని ఎస్.కోట కమ్యూనిటీ ఆసుపత్రికి... మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడని... కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

గజపతినగరం, ఫిబ్రవరి 22:(ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలయ్యాయి. పురిటిపెంట గ్రామం వద్ద శనివారం రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొట్టిన సంఘటనలో మహిళ తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ లక్ష్మణరావు తెలిపిన వివరాల ప్రకారం నడుపూరి రాములమ్మ రోడ్డు దాటుతుండగా ఎదురుగా వస్తున్న బైకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రామలమ్మను ప్రథమ చికిత్స అనంతరం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించినట్లు తెలిపారు. అలాగే మదుపాడ సమీపంలో జాతీయ రహదారి వద్ద ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి వస్తున్న కారు ఢీ కొట్టిన ప్రమాదంలో బూర్లి గోపి, రవి తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

నాటుసారా విక్రయదారుడి అరెస్టు

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విజయనగరం జిల్లాలోని పాలకొండ గ్రామ శివార్లలో అక్రమంగా నాటుసారా విక్రయిస్తున్న బొమ్మాళి అప్పయ్యమ్మ, రౌతు పార్వతిలను అదుపులోకి తీసుకుని 36 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్టు ఎన్‌ఫోర్సుమెంటు ఎస్ఐ రాజశ్రీ తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం ప్రొహిబిషన్, ఎక్సైజ్ పాలకొండ స్టేషన్‌కు అప్పగించినట్టు తెలిపారు. ఈ దాడుల్లో హెచ్‌సీ సుదర్శన్ కుమార్, రాంబాబు, కానిస్టేబుల్ రాము తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులపై గౌరవం అవసరం


మొక్కను నాటుతున్న న్యాయాధికారి

రాజాం రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వృద్ధుల పట్ల వారి కుటుంబ సభ్యులతో పాటు ప్రతి ఒక్కరూ గౌరవం, బాధ్యతతో వ్యవహరించాలని మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, సీనియర్ న్యాయాధికారి కె.శారదాంబ హితవు పలికారు. వారికోసం ప్రత్యేక పథకాలు ఉన్నాయని... వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కొండంపేటలోని వృద్ధాశ్రమంలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వృద్ధులకు చట్టం కల్పిస్తున్న న్యాయసేవలను వివరించారు. ఆశ్రమంలో ని వృద్ధులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఆశ్రమం ఆవరణలో న్యాయాధికారి మొక్క నాటారు. ఆమె వెంట పలువురు న్యాయవాదులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఉన్నారు.

జడ్పీ సీఈవో ఆకస్మిక తనిఖీ


సిబ్బందికి సూచనలిస్తున్న సీఈవో

రాజాం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జడ్పీ సీఈఓ శ్రీధర్ రాజు శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. రూ.3.50 లక్షలతో నిర్మిస్తున్న మరుగదొడ్ల వార్డును పరిశీలించారు. అనంతరం గారాజు చీపురుపల్లి గ్రామానికి చేరుకుని తాగునీటి సరఫరాపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు ట్యాంకులు శుభ్రం చేయడమే కాకుండా బ్లీచింగ్ చల్లించాలన్నారు. ఆయనతో పాటు ఎంపీడీఓ శ్రీనివాసరావు ఉన్నారు.

వేతనదారుల సంఖ్య పెంపునకు కృషి

గజపతినగరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ వేతనదారుల సంఖ్య పెరిగేవిధంగా చర్యలు తీసుకోవాలని డుమా పి.డి. శారదాదేవి అన్నారు. శనివారం గంగచోళ్లపెంట గ్రామంలో ఉపాధి హామీ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో తీర్మానం చేసిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. వేతనదారులకు రూ.300 వంతున రోజు కూలీ వచ్చేలా పనులు కల్పించాలన్నారు. రోజు వారీ వేతనం ఎంత వస్తుందని కూలీలను ప్రశ్నించగా... రూ.270 వరకు వస్తుందని చెప్పారు. దీంతో ,రూ.300కు చేరుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో నిర్మించిన గోశాలలు, సోక్‌పిట్ లను పరిశీలించారు.

కూటమి అభ్యర్థిని గెలిపించండి


ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

గుర్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థి పాకలపాటి రఘువర్మను గెలిపించాలని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు, యువనేత రామ్‌మల్లిక్ నాయుడులు కోరారు. శనివారం స్థానిక జూనియర్ కళాశాలలో ప్రచారం నిర్వహించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్, కాలేజీలను వారు సందర్శించారు. ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులను కలిసి రఘువర్మకు మొదటి ప్రాధాన్య ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెన్ని సన్యాసినాయుడు, జిల్లా టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుమలరాజు కిరణ్ కుమార్, మండల టీడీపీ అధ్యక్షులు చనిమల మహేశ్వరరావులు పాల్గొన్నారు.

రఘువర్మను గెలిపించాలి

భోగాపురం, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): కూటమి అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు మొదటి ప్రాధాన్యం ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి కోరారు. శనివారం భోగాపురం హైస్కూల్లో ఆమె పర్యటించి ఉపాధ్యాయులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

నెల్లిమర్లలో...

నెల్లిమర్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పాకలపాటి రఘువర్మను గెలిపించాలని టీడీపీ సీనియర్ నాయకుడు, విశాఖ ఉత్తర నియోజక వర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్, ఎన్నికల పరిశీలకుడు నజీర్ కోరారు. మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలల్లో వారు శనివారం ప్రచారం చేశారు. రఘువర్మకు ప్రథమ ప్రాధాన్య ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పొంద్రంకి జయరాజ్, టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, జిల్లా కార్యదర్శి లెంక అప్పలనాయుడు, పార్టీ నాయకులు అవనాపు సత్యనారాయణ, రెడ్డి వేణు తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లిలో..

చీపురుపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మకు మద్దతుగా తెలుగుదేశం నాయకులు శనివారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు.బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసి రఘువర్మకు మొదటి ప్రాధాన్య ఓటు వేయాల్సిందిగా అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో గద్దే బాబూరావు, రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, గవిడి నాగరాజు, ఆరతి సాహు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న గద్దే బాబూరావు తదితరులు

ఆ విచారణపై అనుమానాలు

(ఐదో పేజీ తరువాయి)

ఉంటే ఎవరు బాధ్యులు? అన్న ప్రశ్నలు సర్వత్రా ఉత్పన్నమయ్యాయి. ఆ రోజు సాయంత్రం నాలుగు దాటాక వైద్యులు ఉండరని తెలిసి కూడా ఇక్కడకు ఎందుకు తీసుకువచ్చారని 108 సిబ్బందితో ఏరియా ఆసుపత్రి సిబ్బంది వాగ్వాదానికి దిగారు. ఈ విషయాన్ని స్వయంగా 108 వాహన సిబ్బంది చెప్పడంతో ఇదే విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' తన కథనంలో పేర్కొంది. ఆ కథనానికి స్పందించిన డీఎంహెచ్‌వో డాక్టర్ జీవనరాణి హుటాహుటిన ఏరియా ఆస్పత్రికి వెళ్లి విచారించారు. ఘోషాకు రిఫర్ చేసి చేతులు దులిపేసుకున్న తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీష్‌ను ఆదేశించారు.

● ఈనెల 8న డీసీహెచ్‌ఎస్ రాజ్యలక్ష్మి ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. వైద్యులు, సిబ్బందితో సమావేశమై ఘటనపై ఆరా తీశారు. సంఘటన జరిగిన రోజు సీసీ కెమెరాలు, ఫుటేజీలను సేకరించారు. నివేదిక కోరారు.

అక్కడి అధికారితోనే విచారణ!

ఘటనపై విచారణకు ఇతర ఆస్పత్రి వైద్యులను నియమిస్తే నిజానిజాలు వెలుగులోకి వచ్చేవి. ఇక్కడి విచారణకు ఇక్కడి ఏరియా ఆస్పత్రి వైద్యుడినే నియమించడం.. సిబ్బంది, వైద్యుల వివరణను అనుసరించి నివేదిక తయారు చేయడంపై గర్భిణి కుటుంబ సభ్యులు, పలువురు రోగులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. విశేషమేమంటే ఘటన జరిగిన మర్నాడే విచారణకు ఆదేశించిన డీఎంహెచ్‌ఓకు ఇప్పటివరకు నివేదిక అందకపోగా, రెండురోజుల తర్వాత వెళ్లిన డీసీహెచ్‌ఎస్‌కు మాత్రం నివేదిక వెళ్లింది. గౌరమ్మ ఉదంతంలో ఏరియా ఆస్పత్రి వైద్యాధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం లేనేలేదని ఆ నివేదికలో తేల్చేశారు. ఇప్పటి వరకు డీఎంహెచ్‌ఓకు మాత్రం నివేదిక ఎందుకు వెళ్లలేదన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలిపోయింది.

జగన్ ఇంకా భ్రమలోనే ఉన్నారు

● ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి, బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇంకా రాజారెడ్డి రాజ్యం అనే భ్రమలోనే ఉన్నారని, నడుస్తున్నది కూటమి ప్రభుత్వం పరిపాలన అని తెలుసుకోలేకపోతున్నారని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఎద్దేవా చేశారు. స్థానిక బొబ్బిలి కోటలో శనివారం రాత్రి ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి గుంటూరు మిర్చియార్డుకు వెళ్లిన జగన్ అనుచితంగా ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న తీరును చూసి జనం నవ్వుకుంటున్నారన్నారు. అయన భద్రత కోసం బొత్స అండ్ బ్యాచ్ గవర్నర్‌ను కలవడం ఇంకా విడ్డూరంగా ఉందన్నారు.

రఘువర్మ గెలుపునకు కృషి

ఎమ్మెల్సీ రఘువర్మను మళ్లీ అధిక మెజారిటీతో గెలిపించుకునేందుకు పార్టీ శ్రేణులంతా గట్టిగా పనిచేస్తున్నట్టు ఎంపీ తెలిపారు. గతంలో వైసీపీ విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించిందన్నారు. ● ఎమ్మెల్యే బేబీనాయన మాట్లాడుతూ నీతి నిజాయితీ నిబద్ధత కలిగిన రఘువర్మను గెలిపించుకోవాలన్నారు. సమావేశంలో టీడీపీ బొబ్బిలి పట్టణ, మండల అధ్యక్షులు రాంబార్కి శరత్‌బాబు, వాసిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో సమావేశం

బొబ్బిలి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పాకలపాటి రఘువర్మకు మద్దతుగా ఎమ్మెల్యే బేబీనాయన శనివారం స్థానిక ప్రభుత్వ ఐటీఐలో సమావేశం నిర్వహించారు. మొదటి ప్రాధాన్యతా ఓటును రఘువర్మకు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

● బాడంగి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు మద్దతుగా విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు, కొప్పలవెలమ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లి అప్పలనాయుడు శనివారం నియోజకవర్గంలో ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

వసతిగృహ సమస్యల పరిష్కారానికి కృషి

● ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు

బొబ్బిలి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వసతిగృహ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు అన్నారు. బొబ్బిలిలో గల గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను, వసతి గృహాన్ని ఆయన శనివారం రాత్రి సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఈ వసతిగృహం పట్టణానికి దూరంగా ఉండడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఒంటరిగా వెళ్లాలంటే భద్రత పరంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఆయన తెలుసుకున్నారు. అతిపెద్ద వసతిగృహానికి రెగ్యులర్ వార్డెన్ లేకపోవడం పట్ల ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ సమస్యలన్నిటినీ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

బొబ్బిలి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు గొల్లపల్లి వేణుగోపాల మున్సిపల్ హైస్కూలులో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని బొబ్బిలి ఆర్డీవో జేవీఎస్ఎస్ రామ్మోహనరావు శనివారం సందర్శించారు. పోలింగ్ కేంద్రంలో సౌకర్యాలను పరిశీలించారు. ఎంతమంది ఓటర్లు ఇక్కడ ఓటు హక్కును వినియోగించుకోనున్నారో అడిగి తెలుసుకున్నారు. క్యూలైన్లు, బారికేడ్ల ఏర్పాటుపై సూచనలు ఇచ్చారు. ● సెక్టారు అధికారిగా నియమితులైన జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి కూడా గొల్లపల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రీను, సీఐ కటకం సతీష్‌కుమార్, ఎన్నికల డీటీ బలివాడ గౌరీశంకర్, ఆర్ఐ రామ్‌కుమార్, హెచ్ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

● బాడంగి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని సెక్టోరల్ అధికారి కె.మధుసూదనరావు శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 53వ పోలింగ్ కేంద్రంలో 64 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకోనున్నట్టు చెప్పారు. పోలింగ్ కేంద్రంలో విద్యుత్ సౌకర్యం, తాగునీరు ఉండాలని తహసీల్దార్ కె.సుధాకర్‌కు సూచించారు. ఎస్ఐ తారకేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

సౌకర్యాలు కల్పించాలి

రామభద్రపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల అధికారి, జిల్లా పౌరసరఫరాల అధికారి మధుసూదన్ తెలిపారు. రామభద్రపురంలోని పోలింగ్ కేంద్రాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో నాలుగు పోలింగ్ కేంద్రాల్లో 803మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని తెలిపారు. పోలింగ్ ముందురోజే అంతా సిద్ధం చేయాలని తహసీల్దార్ ఆకుల సులోచనారాణికి సూచించారు.

అదనపు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు

గ్యాస్ సిలిండర్ల సరఫరాలో అదనపు వసూళ్లకు పాల్పడినా, రేషన్‌ను ఎండీఎం ఆపరేటర్లు సక్రమంగా పంపిణీ చేయకపోయినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌర సరఫరాల అధికారి మధుసూదన్ హెచ్చరించారు. వీటిపై ఫిర్యాదులు వచ్చిన వెంటనే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. మార్చి నెలలో కందిపప్పు సరఫరా ఉండకపోవచ్చని అన్నారు. రేషన్ వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు వచ్చినా తమకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

క్షయ వ్యాధిపై అవగాహన అవసరం

రామభద్రపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని టీబీ యూనిట్ పర్యవేక్షకురాలు ఆర్.శ్రీదేవి సూచించారు. కోటశిర్లాం గ్రామంలో శనివారం ఆమె ఉపాధిహామీ కూలీలకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. క్షయ అంటువ్యాధి కాదని, క్రమం తప్పకుండా మందులు వాడితే నయం అవుతుందని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రఘువర్మను గెలిపించండి



సాలూరు రూరల్: ప్రచారం చేస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పాకలపాటి రఘువర్మను గెలిపించాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పిలుపునిచ్చారు. ఆమె శనివారం మామిడిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రచారం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆముదాల పరమేశు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ● పాచిపెంట: పాకలపాటి రఘువర్మను గెలిపించాలని మంత్రి సంధ్యారాణి ఉపాధ్యాయులను కోరారు. శనివారం ఆమె స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రచారం నిర్వహించారు. ● బెలగాం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థి పాకలపాటి రఘువర్మను గెలిపించాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కోరారు. పట్టణంలోని డీవీఎంఎం, టీఆర్ఎం పాఠశాలల్లో ఆయన శనివారం ప్రచారం నిర్వహించారు. ఎన్నికల పరిశీలకులు బొడ్డు పైడిరాజు, టీడీపీ నాయకులు మజ్జి వెంకటేష్ పాల్గొన్నారు. ● పార్వతీపురంటౌన్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పి.శివప్రసాద్ శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కళాశాల ల్లో ప్రచారం నిర్వహించారు. ● గుమ్మలక్ష్మీపురం: పాకలపాటి రఘువర్మకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. శనివారం ఆమె మండలంలోని పలు విద్యా సంస్థల్లో ప్రచారం చేశారు. ఆమె వెంట టీడీపీ నాయకులు పాడి సుదర్శనరావు, కృష్ణబాబు, కడ్రక మల్లేశ్వరరావు ఉన్నారు. ● పార్వతీపురం: రఘువర్మను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఉపాధ్యాయులను కోరారు. పట్టణంలో వివిధ పాఠశాలల్లో ఆయన ప్రచారం చేశారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ● పాలకొండ: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాకలపాటి రఘువర్మకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఉపాధ్యాయులు, ఉద్యోగులను కోరారు. పాలకొండలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తుందన్నారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు కర్నేన అప్పలనాయుడు, పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, టంకాల దుర్గారావు, గంటా సంతోష్ పాల్గొన్నారు. ● కురుపాం రూరల్: రఘువర్మను గెలిపించాలని ట్రైకార్ బోర్డ్ డైరక్టర్ పువ్వల లావణ్య కోరారు. శనివారం ఆమె కూటమి నాయకులతో కలిసి మండలంలోని పలు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ప్రచారం చేశారు.



బెలగాం: ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర



గుమ్మలక్ష్మీపురం: ఆశ్రమ పాఠశాలలో ఎమ్మెల్యే జగదీశ్వరి..



పాలకొండ: మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పనిచేయని ఏటీఎం

● నగదు కోసం ఇబ్బంది పడుతున్న బలిజిపేట వాసులు
● మండల కేంద్రంలో ఒకేఒక్కటి కావడంతో తప్పని అవస్థలు

బలిజిపేట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): బలిజిపేటలో యూనియన్ బ్యాంకు ఆవరణలో ఏర్పాటు చేసిన ఏటీఎం సుమారు నెల రోజుల నుంచి పనిచేయకపోవడంతో మండలవాసులు నగదు కోసం ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో ఉన్న ఏకైక ఏటీఎం యూనియన్ బ్యాంకులోనే ఏర్పాటు చేశారు. వివిధ అవసరాల కోసం వచ్చే కస్టమర్లు ఏటీఎంలో డబ్బులు పొందేందుకు పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. కొన్ని సమయాల్లో డబ్బులు లేకపోవడం, మరికొన్ని సమయాల్లో నెట్వర్క్ సక్రమంగా లేకపోవడం కారణంగా ఏటీఎం పనిచేయడంలేదు. దీంతో నగదు తీసుకునేందుకు వచ్చిన ప్రజలు ఉసూరుమంటూ వెనుదిరగాల్సి వస్తోంది. బలిజిపేటలో యూనియన్ బ్యాంకుతోపాటు విశాఖ గ్రామీణ వికాస్ బ్యాంకు, స్టేట్ బ్యాంకు, బీసీసీబీ బ్యాంకులు ఉన్నప్పటికీ ఒక్క యూనియన్ బ్యాంకులో మాత్రమే ఏటీఎం సౌకర్యం ఉంది. అధికారులు స్పందించి ఏటీఎంతోపాటు నగదు జమ చేసుకునే మిషను, పాసుబుక్ ప్రింటింగ్ మిషను సక్రమంగా పనిచేసే విధంగా యూనియన్ బ్యాంకు సిబ్బంది చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే అదనంగా ఏటీఎంలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



పనిచేయని ఏటీఎం, పాస్‌బుక్ ప్రింటింగ్ మిషన్

ఎస్వీడీ కళాశాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు

పార్వతీపురంటౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఇటీవల ఎన్ఏఏసీ(నాక్) బృందం ఈ కళాశాలను సందర్శించింది. విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు, సంస్థ ప్రగతి, తదితర అంశాలను పరిశీలించింది. ఈ మేరకు ఎస్వీడీ కళాశాలకు బీ గ్రేడ్ ఇచ్చారు. రాష్ట్రంలో 169 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 97 కళాశాలలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించగా, అందులో ఎస్వీడీ కళాశాల ఒకటి కావడం విశేషం.

పూర్వ జన్మ సుకృతం

ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.సీహెచ్ చలపతిరావు శనివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఇదే కళాశాలలో విద్యనభ్యసించానని, అధ్యాపకుడిగా, ప్రిన్సిపాల్‌గా చేశానని చెప్పారు. తాను ప్రిన్సిపాల్‌గా ఉన్న సమయంలోనే కళాశాలకు జాతీయ స్థాయి గుర్తింపు రావడం తన పూర్వ జన్మ సుకృతం అన్నారు. త్వరలోనే ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర సహకారంతో డ్రీమ్డ్ యూనివర్సిటీ నిర్మాణానికి శ్రీకారం చుడతామని తెలిపారు.

అంగన్‌వాడీల్లోనే విద్యాభివృద్ధికి బీజం

పార్వతీపురంటౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పిల్లల విద్యాభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాల్లో బీజం పడుతుందని సమగ్ర శిక్ష ఎడిషనల్ ప్రోజెక్టు కోఆర్డినేటర్ ఆర్.తేజేశ్వరరావు అన్నారు. కొత్తవలస కొత్తపోలమ్మ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్నేహ పూర్వక వాతావరణంలో ఆటపాటలతో విద్యా బోధన చేయాలన్నారు. ఎంఈవో ప్రసాదరావు పాల్గొన్నారు. ● మక్కువ: జ్ఞానజ్యోతి శిక్షణతో అంగన్‌వాడీ వ్యవస్థకు ప్రయోజనం కలుగుతుందని పాచిపెంట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో బొత్స అనంతలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఎంఈవోలు పెంట సత్యనారాయణ, పి.శ్యాంసుందర్, అంగన్వాడీ సూపర్‌వైజర్స్ పి.రాజశ్రీ, ఎన్.లీలావతి పాల్గొన్నారు. ● గరుగుబిల్లి: ప్రైవేటు కాన్వెంట్లకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో బోధన నిర్వహించాలని కొమరాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో గొట్టాపు సుగుణకుమారి సూచించారు. శనివారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి శిక్షణలో కార్యకర్తలకు పలు అంశాలపై ఆమె అవగాహన కల్పించారు. రిసోర్స్ పర్సన్లు, సూపర్‌వైజర్ రౌతు లక్ష్మి, సీఆర్ఎంటీ బి.రామకృష్ణ పాల్గొన్నారు.

గుండె ఆరోగ్యంపై కనీస పరిజ్ఞానం ఉండాలి

బొబ్బిలి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి టీబీఆర్ ఫంక్షన్ హాలులో శనివారం రాత్రి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో రెండు రోజుల సైంటిఫిక్ డే కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. స్థానిక ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డా.గుల్ల రామ్ నరేశ్, డా.ఎ.దివాకర్ బాబు ఆధ్వర్యంలో జరిగిన సెమినార్‌లో వైద్య నిపుణులు ప్రసంగించారు. ప్రముఖ గుండె వైద్య నిపుణులు డా.గుల్ల సూర్యప్రకాశ్ మాట్లాడుతూ ఆంజైనా అండ్ ఎక్యూట్ ఎంఐ అనే అంశంపై తమ అనుభవాలను వివరించారు. గుండె ఆరోగ్యానికి సంబంధించి ప్రతీ ఒక్కరూ కనీస పరిజ్ఞానాన్ని కలిగి ఉండడం చాలా అవసరమన్నారు. రక్తసంబంధిత అంశాలపై హెమటాలజిస్టు ఉప్పాడ రమేష్ ప్రసంగిస్తూ అనేక సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ద్వారపురెడ్డి రామ్మోహనరావు, కేవీ అప్పారావు, ఎ.గోపీనాథ్, కాశినాయుడు, ప్రతిమాదేవి, డీవీజీ శంకరరావు, బలరామ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు సక్రమంగా చేపట్టాలి

రామభద్రపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులు చేసేటప్పుడు మస్తర్లలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏపీవో గొలగాని త్రినాధరావు హెచ్చరించారు. నాయుడువలస గ్రామంలో చేపడుతున్న పనులను ఆయన శనివారం పరిశీలించారు. మస్తర్లు తనిఖీ చేశారు. పనులకు రాకుండా మస్తర్లు వేస్తే ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రింగ్ ట్రెంచ్‌లు పరిశీలించారు.



ఎస్‌డబ్ల్యూపీసీలపై అలసత్వం వద్దు

● జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు

గరుగుబిల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద కేంద్రాల (ఎస్‌డబ్ల్యూపీసీ) నిర్వహణపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు హెచ్చరించారు. మండలంలోని కొంకడివరం, ఉల్లిభద్ర పంచాయతీల్లో ఆయన శనివారం పర్యటించారు. ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించి, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పంచాయతీల్లో శని, ఆదివారాలు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. మండల విస్తరణాధికారులు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ పరిశీలనలో మండల పంచాయతీ విస్తరణాధికారి ఎల్.గోపాలరావు, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ మరడాన తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బలిజిపేట: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఈవోపీఆర్డీ కె.పుష్పారావు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శని, ఆదివారాల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో పరిసరాలను పరి శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.

ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవు

గరుగుబిల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల పరిధిలో అనధికారికంగా ఆక్ర మణలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ పి.బాల హెచ్చరించారు. చినగు డబ కొండ ప్రాంతాన్ని ఆమె శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఆక్రమణలపై కలెక్టర్‌కు అందిన ఫిర్యాదు మేరకు ఇక్కడకు వచ్చినట్టు తెలిపారు. ఆక్రమణలకు పాల్పడ్డవారు స్వతహాగా ముందుకు వచ్చి తొలగించాలన్నారు. ధిక్కరిస్తే రెవెన్యూ శాఖ తొలగింపు చర్యలు చేపడుతుందని స్పష్టం చేశారు. చినగుడబ ప్రాంతంలోని క్వారీ యాజమాన్యం ఆక్రమణలకు పాల్పడినట్లు పలువురు గ్రామస్థులు ఫిర్యాదు చేశారని, పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వ హించి ఆక్రమణలు ఉన్నట్లు రుజువైతే తొలగింపు తప్పదన్నారు. ఆక్రమణలకు పాల్పడ్డ పలువురు కొంత సమయం కావాలని కోరడంతో తొలగింపునకు సమయం కేటాయించారు. పూర్తిస్థాయిలో నివేదికలు తగు చర్యలు నిమిత్తం కలెక్టర్‌కు నివేదిస్తామని చెప్పారు. ఈ పరిశీలనలో ఎస్ఐ పి.రమేష్ నాయుడు, ఆర్ఐ శ్రీనివాస్ గౌరీప్రసాద్, వీఆర్వోలు, హెచ్‌సీ ఈశ్వరరావు ఉన్నారు.

ఆనాటి గురువులకు సత్కారం



సత్కారం పొందిన గురువులు

బొబ్బిలి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి సంస్థానం ఉన్నత పాఠశాలలో 1977-78లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు శనివారం విశాఖ దసపల్లా హోటల్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నాటి విద్యార్థుల సంఘం ప్రతినిధులు పి.శ్రీనివాసరావు, పీఏ జగదీశ్, వీవీ రాజు, రెడ్డి రామారావుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నాటి గురువులకు పాద పూజ చేశారు. వారిని ఘనంగా సత్కరించారు. విశ్రాంత ఉపాధ్యాయులైన గోనా అప్పారావు, కొల్లి గంగునాయుడు, జి.వెంకటనాయుడు, ఎస్.సన్యాసిరావు, సుశీలమ్మలను ఘనంగా సత్కరించారు.

అసాంఘిక చర్యలపై నిఘా పెట్టాలి

రామభద్రపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిఘా పెట్టాలని ఎస్ఐ వెలమల ప్రసాద్ సూచించారు. శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో మహిళా పోలీసులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్టు షాపులు లేకుండా నిరోధించాలన్నారు. మత్తు పదార్థాలు రవాణాపై దృష్టి సారించాలని ఆయన తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలి

రామభద్రపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఈవోపీఆర్డీ వెంకటరమణ కోరారు. తడి, పొడి చెత్తల సేకరణపై శనివారం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌ను ఆయన పర్యవేక్షించారు. నాయుడువలస పంచాయతీ కార్యదర్శి అడపా ఈశ్వరరావు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యా యత్నం

సీతానగరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గెడ్డలుప్పి గ్రామానికి చెందిన సొంగల కృష్ణమూర్తి శనివారం పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు ఔట్‌పోస్టు పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. కృష్ణమూర్తి గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బాధను తట్టుకోలేక పురుగు మందు తాగి ఆత్మహత్యా ప్రయత్నం చేసుకున్నాడు. కుటుంబీకులు పార్వతీపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విజయనగరం తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కురుపాం, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. జియ్యమ్మవలస మండలం దాసరిపేట నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న చింతాడ రమణమూర్తిను కురుపాం నుంచి దాసరిపేట వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో రమణమూర్తికి గాయాలయ్యాయి. వెంటనే కురుపాం సీహెచ్‌సీకి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు నిర్వాహిస్తున్నారు.







